క్లుప్తంగా

కొనసాగుతున్న తనిఖీలు

తాడూరు: ఎన్నికల నిర్వహణలో భాగంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్ పాయింట్ వద్ద తనిఖీలు ముమ్మరం చేశారు. వాహనాలను నిలిపి వివరాలను అధికారి శ్రీనివాస్ రిజిస్టర్‌లో నమోదు చేసుకున్నారు. ఆదివారం 15 వాహనాల వరకు తనిఖీ చేశామని ఆయన పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వాసవీకన్యకా పరమేశ్వరీ దేవాస్థానం ఆవోపా నూతన కమిటీ ఆదివారం కొలువుదీరింది. నూతన అధ్యక్షుడిగా సతీష్, కార్యదర్శిగా శోభన్‌బాబు, కోశాధికారి వెంకటేశ్వర్లుతో ఆవోపా రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ విద్యా ట్రస్టు ద్వారా 300 మందికి ఉచితంగా ఉన్నత విద్య అందజేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రమేశ్ బాబు, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి రమేశ్, కోశాధికారి శివ, జగదీశ్వర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

చారకొండ: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దాదాపుగా 20 మంది ఆదివారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. స్థానిక నాయకులు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వెంకట్ గౌడ్, మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అచ్చంపేట్ కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి వంశీకృష్ణ స్వాగతించారు. పార్టీలో చేరిన వారిలో మేకల శ్రీనివాస్ రెడ్డి, గజ్జ జంగయ్య, చింతపల్లి రమేష్, ఆర్లేళ్ల విష్ణు తదితరులు ఉన్నారు.

చెక్కు పంపిణీ

కల్వకుర్తిరూరల్: మండలంలోని పంజుగుల గ్రామానికి చెందిన నర్సింహకు మంజూరైన రూ.96 వేల సీఎం సహాయనిధి చెక్కును ఆదివారం ఆయన ఇంటి వద్దకు వెళ్లి సర్పంచ్ పద్మ అంజియాదవ్ అందజేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సహకారంతో మంజూరు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు పద్మ, ఏలీశ, చెన్నకేశవులు, ఖాజా, దారమోని గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కొల్లాపూర్: పట్టణానికి చెందిన రిటైర్డ్ వెటర్నరీ ఉద్యోగి కంటె రామస్వామి ఆదివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి రామస్వామి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం

కోడేరు: ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని గ్రామ మస్సు అధికారి మహ్మద్‌ఖాజా అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులో ప్రయాణం ప్రాణాలకు రక్షణ ఉంటుందని ప్రైవేట్ వాహనాల్లో వెళ్లరాదని అన్నారు. అదే విధంగా శుభకార్యాలకు ఆర్టీసీ బస్సును అద్దెకు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో లక్ష్మయ్య. స్వామి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల సస్పెండ్

ఊర్కొండ: మండలంలోని జకినాలపల్లి సర్పంచ్ అనిల్‌రెడ్డి, రాచాలపల్లికి చెందిన శ్రీధర్‌రెడ్డిని బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు వీరారెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ నష్టం చేస్తున్నందున వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పాస్టర్స్ కమిటీ ఎన్నిక

కందనూలు: జిల్లా కేంద్రంలోని జీసస్ హోప్ మినిస్ట్రీస్‌లో జిల్లా పాస్టర్స్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులుగా యేసుదాస్, నతానిమేలు, క్రిస్టిఫర్, సామ్యేల్, జాన్ సుందర్ రావు, జోసెఫ్ తదితరులను ఎన్నుకున్నట్లు జిల్లా కమిటీ అధ్యక్షుడు పాల్ రాజు తెలిపారు.

కలిసికట్టుగా పనిచేద్దాం



పెంట్లవెల్లి: నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కలిసికట్టుగా కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి కృష్ణారావు విజయం కోసం కృషి చేయాలని జూపల్లి అరుణ్ కోరారు. మండలంలోని మంచాలకట్టలో ఆదివారం కార్యకర్తల సమావేశం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేద్దామన్నారు. ప్రజలకు బీఆర్ఎస్‌పై నమ్మకం పోయిందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్, గోపినాయక్, డబ్బ రాముడు, రాఘవేంద్ర, రమేష్, కురుమయ్య, డబ్బ గోవిందు, శేకర్, నాగరాజులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్ల అధ్వానం



మొల్కమామిడికి వెళ్లే దారి ఇలా..



పల్లెరూట్‌పెంటకు వెళ్లే మట్టి రోడ్డు

అమ్రాబాద్: మండలంలోని పలు గ్రామీణ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. కొన్నిచోట్ల ప్రయాణించేందుకు వీలు లేకుండా పోయిందంటే అతిశయోక్తి కాదు. ప్రభుత్వ పాలకుల ఉపన్యాసాలకు క్షేత్రస్థాయిలో ఉన్న రోడ్లకు పొంతన లేకుండా ఉంది. మండలంలోని మొల్కమామిడి, ఈదులబావి గ్రామాలతో పాటు చెంచు పెంటలకువెళ్లే మల్లాపూర్‌పెంట, పుల్లాయపల్లి, సార్లపల్లి, కుడిచింతలబైలు తదితర పెంటల రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. పదర మండలంలోని కోడోనిపల్లి, పల్లెరూట్‌పెంట, కండ్లకుంట తదితర గ్రామాలకు మట్టిరోడ్లు ఎగుడు దిగుడుగా ఉండటంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. బీటీ రోడ్లు లేక ఆయా గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. దీంతో బస్సులు నడిపేందుకు ఆర్టీసీ వెనకడుగు వేస్తోంది. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించకతప్పడం లేదని స్థానికులు వాపోయారు.

హామీలకే పరిమితం

గ్రామాలకు బీటీ రోడ్లు వేయించాలని ఎన్నో మార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. ఎన్నికల సమయంలో వచ్చిన నాయకులంతా రోడ్లు వేయిస్తామని హామీలు ఇస్తూ గెలిచిన తర్వాత పత్తాలేకుండా పోతారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గ్రామాలకు బీటీ రోడ్లు మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

నివేదిక అందజేశాం

మట్టిరోడ్లు ఉన్న గ్రామాలకు బీటీ రోడ్లు వేయాలని ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం. ఇటీవల రెండు గ్రామాలకు బీటీ రోడ్లు వేశాం. నిధులు మంజూరు అయిన వెంటనే మిగతా గ్రామాల్లో బీటీ రోడ్లు వేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

–శ్రీనివాసులు, పీఆర్‌ఏఈ, అమ్రాబాద్

కొత్తగా రోడ్డు వేయాలి



ఎన్నో ఏళ్లనుంచి రోడ్లు గుంతలమయంగా ఉన్నాయి. మద్దిమడుగు రోడ్డు నుంచి పల్లెరూట్ పెంట కిలోమీటర్ దూరంలో ఉంది. నాయకులు, ప్రజాప్రతినిధులు ఎంతో మందికి విన్నవించినా పట్టించుకోవడం లేదు. బీటీ రోడ్డు నుంచి పెంటకు సరుకులు తీసుకెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. ఇప్పటికైనా పెంటకు కొత్తగా రోడ్డు వేయాలి.

–గంగయ్య, పల్లెరూట్‌పెంట

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



ఎమ్మెల్యే బీరంహర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న పెంట్లవెల్లి నాయకులు

కొల్లాపూర్: పెంట్లవెల్లి మండల కేంద్రానికి చెందిన 11 వవార్డు సభ్యురాలు సయ్యద్ గౌసియాబేగంతో పాటు మరికొందరు, వీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన యువకులు, పెద్దకొత్తపల్లి మండలం బాచారం గ్రామానికి చెందిన నాయకులు పెద్దసంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆదివారం వారికి కొల్లాపూర్‌లోని తన నివాసం వద్ద ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పారు. సింగోటం గ్రామంలోని తన వ్యవసాయ క్షేత్రంలో సాతాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పుట్టపోగు రాములు, మాజీ ఉపసర్పంచ్ బావికాడి నర్సింహ్మా, వార్డు సభ్యులు జూపల్లి స్వరూప, మంగలి రమేష్‌బాబు, పొడేండ్ల కురుమయ్యతో పాటు 150 మందికి పైగా గ్రామస్తులు బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రానికి చెందిన 11వ వార్డు మెంబర్ సయ్యద్‌గౌసియా, బీఎస్పీ మండల నాయకులు మైమూద్, సయ్యద్‌నబీ, ఎండీ సమద్‌లు బీఆర్ఎస్‌లో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో ఆదివారం కొల్లాపూర్ పార్టీ కార్యాలయంలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయ్‌కుమార్, పోతుల వెంకటేశ్వర్లు, శేషాంద్రప్రసాద్, రమణ, గోవురాజులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: కొల్లాపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా తనవంతుగా గ్రామాలను అభివృద్ధి చేశాను. ప్రజలు మళ్లీ ఒకసారి అవకాశం కల్పించాలని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. గంట్రావుపల్లిలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మరొక్కసారి అవకాశం కల్పిస్తే గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

గంట్రావుపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, రజకులు, విశ్వబ్రాహ్మణులు 150 మంది ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. సింగోటంలో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో 150 మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్, గణేష్‌రావు, వెంకటయ్య, ప్రేమ్‌రాజారావు, నాగరాజు పాల్గొన్నారు.

అభివృద్ధి శంకుస్థాపనలకే పరిమితం

కల్వకుర్తిరూరల్: నియోజకవర్గంలో అభివృద్ధి అంతా శంకుస్థాపనలకే పరిమితం అయ్యిందని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఎద్దేవాచేశారు. ఆదివారం కల్వకుర్తి మండలం జీడిపల్లి తండాలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం నాలుగున్నర సంవత్సరాలు మొద్దు నిద్ర నటించి ఎన్నికలు సమీపించిన తరుణంలో శంకుస్థాపనలు చేసి హడావుడి చేశారని విమర్శించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వార భూములు కోల్పోయిన రైతులకు ఇంత వరకు పూర్తిగా నష్టపరిహారం అందలేదన్నారు. అనంతరం పలువురు ఆయన సమక్షంలో పార్టీలో చేశారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్ మాట్లాడుతూ కాంగ్రెస్ గెలుపుతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్‌తో పాటు మిరియాల శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దళితులపై అఘాయిత్యాలు అరికట్టాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం దళితులపై అఘాయిత్యాలు అరికట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గోపని పద్మ డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దళిత సమితి జిల్లా సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె హాజరై మాట్లాడారు. ఇప్పటికీ దళితులు అంటరానితనం, కులవివక్ష, అత్యాచారాలకు గురవడం బాధకరమన్నారు. కఠిన చట్టాలు తీసుకురావాలని కోరారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. కులాంతర వివాహాలు చేసుకుంటున్న జంటలకు రక్షణ కల్పించాలని, ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న, డిహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి లక్ష్మీపతి, వ్యవసాయ కార్మిక సంఘం ఆంజనేయులు, హనుమంతు, శివకృష్ణ,సురేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం



తెలకపల్లి: మర్రిజనార్దన్‌రెడ్డిని మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించి అసెంబ్లీకి పంపాలని బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలంలోని నడిగడ్డలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికి వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు. నియోజకవర్గం అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. అనేక సంక్షేమ పథకాలు ఎంజేఆర్ ట్రస్ట్ ద్వారా స్వచ్ఛందంగా ఎమ్మెల్యే మర్రి ఎన్నో కార్యక్రమాలు చేశారని వివరించారు. కార్యక్రమంలో ఆయూబ్, సాంబశివుడు, వెంకటయ్య, రాములు, భాస్కర్, నర్సింహారెడ్డి, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులు ఏకం కావాలి



తాడూరు: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విశ్వబ్రాహ్మణులు ఏకమై హక్కులను సాధించుకోవాలని విశ్వబ్రాహ్మణ సంఘం మండల నాయకులు వీరాచారి, భాస్కరాచారి, అనంతరాముడు కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక చెన్నకేశవ ఆలయ ఆవరణలో విశ్వబ్రాహ్మణుల మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా తమను ఆదుకోవడంతోపాటు సంక్షేమ పథకాలలో విశ్వబ్రాహ్మణులకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. రాష్ట్రం సాధనలో విశ్వబ్రాహ్మణుల పాత్రను మరిచిపోలేమన్నారు. చట్ట సభలలో విశ్వబ్రాహ్మణులకు రాజకీయంగా అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తిరుపతాచారి, కృష్ణామాచారి, శ్రీనివాసులు, విశ్వనాథం, మల్లాచారి, రామాచారి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

అచ్చంపేట రూరల్: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ అన్నారు. ఆదివారం కౌన్సిలర్ రమేష్‌రావు ఆధ్వర్యంలో 20వ వార్డులో వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే గువ్వల బాలరాజును మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తులసీరాం, కౌన్సిలర్ జి. శివ, లింగం యాదవ్, వీరాచారి, అనీల్‌యాదవ్, వెంకటయ్య, గోపాల్, సుధాకర్, యాదగిరి, శంకర్‌చారి, చరణ్‌చారి, అరుణ్ పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

తెలకపల్లి: అంబులెన్స్‌లోనే ఓ గర్భిణీ ప్రసవం అయిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. అంబులెన్స్ సిబ్బంది వివరాల ప్రకారం మండలంలోని బొప్పల్లికి చెందిన కవితకు ఆదివారం పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108 వాహనం గ్రామానికి చేరుకుని గర్భిణీ కవితను అంబులెన్స్‌లో తరలించారు. మార్గమధ్యలో పురిటి నొప్పులు అధికం కావడంతో 108 వాహన సిబ్బంది ఈఎంటీ సిబ్బంది శ్రీకాంత్, పైలెట్ రాముడు పర్యవేక్షణలో సాధారణ కాన్పు చేశారు. మహిళ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలను నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారని అంబులెన్స్ సిబ్బంది తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కోడేరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన 1998–99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం పాఠశాలలో సమావేశమయ్యాయి. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఎక్కడెక్కడ స్థిరపడ్డారో అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు దొరస్వామి, ప్రభాకర్‌రెడ్డి, విష్ణు, వి.రాంరెడ్డిలను పూలమాలలతో సన్మానించారు. పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 24 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు కలుసుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు సంక్షేమ పథకాలు



ఉప్పునుంతల: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేద ప్రజలకు సంక్షేమ పథకాల ఫలాలు అందుతాయని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని మామిళ్లపల్లి, దాసర్లపల్లి గ్రామాల్లో ఆయన కాంగ్రెస్ ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కొంతమంది బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. జెడ్పీటీసీ అనంతప్రతాప్‌రెడ్డి, అనంతరెడ్డి, నర్సింహారెడ్డి, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

వెల్దండ: మండలంలోని కొట్రలో నూతనంగా నిర్మిస్తున్న కంఠ మహేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి ఆదివారం సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్ రూ.15వేలు, బాదేపల్లి లక్ష్మయ్యగౌడ్ రూ.10వేలు విరాళంగా ఇచ్చారు. ఆదివారం దాతలు ఆలయ కమిటీ నాయకులకు నగదు అందజేశారు. నాయకులు నాగరాజుగౌడ్, వెంకటయ్యగౌడ్, అల్లాజీగౌడ్, బలరాంగౌడ్ ఉన్నారు.

పంచాయతీలపై ప్రభుత్వం అశ్రద్ధ



ఊర్కొండ: పంచాయతీలపై ప్రభుత్వం అశ్రద్ధ వహించడంతో సర్పంచ్‌లు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడ్డారని జడ్చర్ల కాంగ్రెస్ అభ్యర్థి జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలో ఆదివారం మండలంలోని జకినాలపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పాలకులు స్థానిక సంస్థలను నిర్వీర్యం చేశారన్నారు. నిధుల విడుదలలో ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. అనంతరం మండలంలోని జికినాలపల్లి, ముచ్చర్లపల్లి, రాచాలపల్లి బీఆర్ఎస్ సర్పంచ్‌లు తలసాని అనిల్ రెడ్డి, వీరెడ్డి పర్వత రెడ్డి, విజయమ్మతో పాటు నాయకులు శ్రీధర్ రెడ్డి, సుజీవన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీలో చేరారు. నాయకులు పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే సేవకుడిగా పనిచేస్తా: ఆచారి



కల్వకుర్తి రూరల్: నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించి ఒక్క అవకాశం ఇస్తే ప్రజలకు సేవకుడిగా పనిచేస్తానని జాతీయ బీసి కమిషన్ మాజీ సభ్యుడు, బీజేపీ అభ్యర్థి ఆచారి అన్నారు. ఆదివారం ప్రచారంలో భాగంగా మండలంలోని వేపూరు, తోటపల్లి, ఎల్లికట్ట, వెంకటాపూర్, జీడిపల్లి, కురుమిద్ద గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు ఆచారికి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అభివృద్ధి సంక్షేమంలో కల్వకుర్తి వెనుకబడిపోయిందన్నారు. దేశంలో ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయన్నారు. ఐదుసార్లు పోటీ చేసి ఓడిపోయానని ఆరో సారి ప్రజల ఆశీర్వాదం కోసం మరోసారి పోటీ చేస్తున్నానని అన్నారు. ఒక్క అవకాశం ఇస్తే నియోజవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో 50 మంది యువకులు పార్టీలో చేరారు. రామచంద్రారెడ్డి, సురేందర్‌గౌడ్, నర్సిరెడ్డి, శేకర్‌రెడ్డి, నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలి



బిజినేపల్లి: ఎమ్మెల్యే టికెట్ రాకపోయేసరికి పార్టీలు మారే నాయకుల గురించి ప్రజలు ఆలోచించాలని, వారికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ దిలీపాచారి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ అవినీతి చేసిందని, ఆ పార్టీ స్థానిక ఎమ్మెల్యేపై నల్లమట్టి ఆరోపణలు, అక్రమ కేసులు పెట్టించాడని ఆరోపించి నేడు అదే పార్టీకి, మర్రి జనార్దన్‌రెడ్డికి ఎలా సహకరిస్తారన్నారు. నాగం జనార్దన్‌రెడ్డి పూర్తిగా ఊసరవెల్లిలా రంగులు మారుస్తున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో వారిని గెలిపిస్తే దౌర్జన్యాలు, అవినీతి, అక్రమ కేసులతో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. బీసీని సీఎం చేస్తామని అమిత్‌షా ప్రకటన చేశారని, ప్రజలు ఈ విషయం గుర్తించి విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, భూషయ్య, నారాయణాచారి, జాకీర్‌హుసెన్, తిరుపతిరెడ్డి, వెంకటయ్య చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

అచ్చంపేట రూరల్: బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సతీష్‌మాదిగ అన్నారు. ఆదివారం అచ్చంపేట పట్టణంలోని పలు వార్డుల్లో బీజేపీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దేశంలో బీజేపీ చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే మరింత అభివృద్ధి చెందనుందన్నారు. అచ్చంపేట అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రేణయ్య, బాలాజీ, భరత్‌చారి తదితరులు పాల్గొన్నారు.

చేసిన అభివృద్ధే విజయానికి సోపానం



కల్వకుర్తి రూరల్: నియోజకవర్గంలో చేసిన అభివృద్ధే తన విజయానికి బాటలు వేస్తాయని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం కల్వకుర్తి పట్టణంలోని 16వ వార్డులో ఎమ్మెల్యే ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కోట్ల రూపాయలతో కల్వకుర్తి నియోజకవర్గం అభివృద్ధి జరిగిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ చైర్మన్ శ్రీశైలం, వైస్ చైర్మన్ షాహెద్, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఐపై ఏసీబీలో కేసు నమోదు

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న ఆంజనేయులుపై ఏసీబీలో కేసు నమోదైనట్లు ఏసీబీ కార్యాలయం సిబ్బంది శనివారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 7న పట్టణంలో నరేష్, జగన్‌లకు సంబంధించిన కార్లు ఢీకొన్నాయి. ఘటన స్థలానికి ఏఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది చేరుకుని కారును తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. నరేష్‌కు సంబంధించిన కారును పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. అతని వద్ద నుంచి రూ.5 వేలు ఏఎస్ఐ, రూ.30 వేలు కారు మరమ్మతుకు జగన్ అనే మరో కారు యజమానికి ఇవ్వాలని చెప్పారు. ఏఎస్ఐ అడిగిన విధంగా నరేష్ రూ.3,500 నగదుగా, రూ.1,500 ఫోన్‌పే ద్వారా అందజేశాడు. ఆ తర్వాత డబ్బులు డిమాండ్ చేశాడని ఏఎస్ఐపై నరేష్ ఏసీబీలో ఫిర్యాదు చేయగా.. అతనిపై శనివారం కేసు నమోదయ్యింది. ఘటనపై విచారణ చేపడుతున్నామని ఏసీబీ అధికారులు ప్రెస్‌నోట్‌లో తెలియజేశారు. ఇదే విషయమై ఎస్ఐ రమేష్‌ను వివరణ కోరగా.. విషయం తెలియదని, విచారణ కొనసాగిన అనంతరం పూర్తి విషయాలు బయటకు వస్తాయని అన్నారు. ఇక్కడ గతంలో ఏఎస్ఐగా పనిచేస్తున్న సమయంలోనే డబ్బులు డిమాండ్ చేయటంతో పాటుగా, ఇసుక రవాణాలో ఆరోపణలు ఎదుర్కొని బదిలీపై వెళ్లారు. ఎన్నికల సమయంలో నిర్వహించిన బదిలీలో ఇక్కడకు ఆరు నెలల కిందట వచ్చిన అతని తీరు మార్చుకోవడంలేదని వాపోతున్నారు.

తప్పుడు ప్రచారాలు సరికావు

కల్వకుర్తిరూరల్: కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారాలు మానుకోవాలని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు జంగయ్య హెచ్చరించారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మర్యాదపూర్వకంగా కాంగ్రెస్ నాయకులను కలిస్తే పార్టీలో చేరినట్లు అసత్య ప్రచారాలకు ఆ పార్టీ నాయకులు తెరలేపారని విమర్శించారు. ఇది ఎంతవరకు సమంజసమని వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వైస్ ఎంపీపీ గోవర్ధన్, జీడిపల్లి తండా సర్పంచ్ శాంతమ్మ, ఎంపీటీసీ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు అండగా ఉంటాం



కొల్లాపూర్: నియోజకవర్గ యువతకు అండగా ఉంటామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో యువ భరోసా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రావు హాజరై మాట్లాడుతూ కొల్లాపూర్ మార్పుకోసం, యువత ఉపాధి కోసం తనవంతు కృషిచేస్తా అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. యువతను మద్యానికి బానిసలు చేసిన ఘటన బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. సమావేశంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని యువకులు ఆదివారం నాగర్‌కర్నూల్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావును కలిసి మండలంలోని ప్రధాన సమస్యలపై చర్చించారు. యువకుల సమస్యలు పరిష్కరించేందుకు సానుకూలంగా ఉన్నామని ఆయన ప్రకటించడంతో యువకులు బీజేపీకి మద్దతుగా ప్రచారం చేసేందుకు ముందుకు వచ్చారు.

బీఎస్పీతోనే బహుజన రాజ్యాధికారం



తెలకపల్లి: బీఎస్పీతోనే బహుజన రాజ్యాధికారం సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు శివశంకర్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం బీఎస్పీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాన్షీరాం ఆశయాలు సాధిద్దామని పేర్కొన్నారు. ఏనుగు గుర్తుకు ఓటు వేసి కొత్తపల్లి కుమార్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. మహిళా నాయకురాలు సృజన తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లకు బుద్ధి చెబుదాం

కోడేరు: అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌లకు బుద్ధి చెబుదామని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండలంలోని సింగాయిపల్లిలో సీపీఎం కుటుంబ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు గిట్టుబాటు ధరకల్పిస్తామని చెప్పి రైతులను మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందన్నారు. లక్ష రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి రైతులను మోసం చేసిందన్నారు. ప్రజలు ఓట్లతో రెండు పార్టీల అభ్యర్థులకు గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో రాంరెడ్డి, నర్సింహ్మ, మద్దిలేటి, చంద్రశేఖర్, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జమ్ము తొలగింపు

కోడేరు: మండలంలోని సింగాయిపల్లి, రాజాపూర్, రేకులపల్లి, ఒప్పితండా షాగాపూర్, మాధవరావుపల్లి వరకు కాలువలో జమ్ము ఏపుగా పెరిగింది. దీంతో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి తన సొంత ఖర్చులతో జమ్మును తొలగించి రైతుల పొలాలకు సాగు నీరు అందించారు.